# పెళ్ళైన కొడుకు

## ఇసుకపల్లి దక్షిణామూర్తి

నిక్షేపంలాంటి ఎ.జి. ఆఫీసు ఉద్యోగం మానుకుని వకీలు ప్రాక్టీసు పెట్టాలని గోపాలం అలోచనలో పడ్డప్పుడే పార్వతికి భయం వేసింది. తలిదండ్రులనీ, పెళ్ళాం పిల్లల్నీ అదుపులో పెట్టుకోలేనివాడు, నోట్లో నాలుక లేనివాడు ఆ కోర్టులకు పోయి ఏమి నిర్వాకం చేసుకువస్తాడు? అని పార్వతి జంకింది. పార్వతి పిరికిమందు నూరిపోస్తున్న కొద్దీ గోపాలానికి రోషం వచ్చింది. పార్వతి ఊళ్లోలేకుండా చూసి, ఆఫీసులో రాజీనామాచేసి, గోడకు బోర్డు తగిలించి, కేసులవాళ్ళు వస్తారేమోనని గుమ్మంలో ఎదురు చూస్తుంటే పార్వతి వాళ్ళ నాన్నను వెంటబెట్టుకుని ఇంటికి తిరిగి వచ్చింది.

'ఏంటి అల్లుడూ... ప్రాక్టీసు పెట్టావుట!' అన్నాడు మామగారు దొడ్లో బాదంచెట్టుదగ్గర కాళ్ళు కడుక్కుంటూ. పార్వతి తెలుగులోనూ సంస్కృతంలోనూ దులిపేసింది. ఒక చిన్న యుద్ధం జరిగినంత పనయింది. ఆ రాత్రి పడుకునేదాక జరిగిన సంభాషణల సారాంశం ఏమిటంటే 'ఇట్లాంటి బుద్ధితిరుగుడుందని ముందరే తెలిస్తే పదిహేను వేలు కట్నంపోసి పిల్లను ఇచ్చేవాణ్ణి కాదు...' అని.

'నీ ఉద్దేశం ఏమిటి...' అని అడిగాడు భార్యను గోపాలం.

'ఈ పెళ్ళికి ఛస్తే ఒప్పుకునేదాన్ని కాదు...' అంది పార్వతి మొహమాటం లేకుండా. మూల కుండ ఉంటే గ్లాసుడు మంచినీళ్ళు తీసుకు వచ్చింది." గది నిండా నీళ్ళు వస్తాయని చూచాను గాని లేకపోతే ఆ కుండ బద్దలు కొట్టి చెప్పే దాన్ని" అంది పార్వతి. గోపాలం నచ్చ చెప్పాలని ప్రయత్నించాడు.

'నేనంటే ఇష్టంలేదా...మన క్షేమం కోరే ఈ నిశ్చయం తీసుకున్నాను... గొర్రెతోకలాంటి ఈ ఉద్యోగం ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది...'

'గొర్రెతోకో...ఎలికతోకో... ఈ తోకలేని ఉద్యోగం కంటే ఏదో ఒక తోక ఉండటం నయం కదా...' పార్వతి గుడ్లురిమింది.

'అంత నిష్ఠూరంగా మాట్లాడకు... ఈ ఉద్యోగంలో ఏం మిగిలింది చెప్పు ...నీకు ఒక జత గాజులు గూడ చేయించలేకపోయాను...ఏడాది తిరిగే లోగా చూడు...ముంజేతినుంచి మోచేతి దాకా గాజులు తొడిగిస్తాను...'

'నాకు తొడిగించక్కర్లా... మీరు గాజులు వేసుకుని ఇంట్లో కూర్చోకుండా ఉంటే చాలు...' పార్వతికి అక్కసు ఆగకుండా పొర్లుకువస్తోంది. గోపాలం అవాక్కయిపోయాడు.

'నా మాట నిలపెట్టుకున్న తర్వాతనే నీతో మాట్లాడతాను...సూర్యనారాయణ, రాఘవరావు ప్రాక్టీసుపెట్టి కార్లు కొనుక్కుని దర్జాగా బతకట్లేదా... ఏంటి అపశకునం మాటలు మాట్లాడతావు...'

'పులిని చూసి నక్క వాతలు పెట్టుకుందట...అట్లా ఉంది...' పార్వతి ఈసడింపుగా అంది.

'పార్వతీ నువ్వేనా ఇట్లా మాట్లాడుతోంది...?... ఈ చిన్న ఉద్యోగం మార్పుచేస్తే...ఇంత రభసే చేస్తావనుకోలేదు సుమా..పెళ్ళయిన కొత్తలో జన్మ, జన్మలకీ కలిసి బతుకుదాం... అని గుళ్ళో దణ్ణాలుపెట్టుకున్నాం...' గోపాలం అనునయంగా మాట్లాడబోయాడు...

'జన్మ, జన్మలకీ అనుకున్నమాట ...నిజమేగాని... ఈ వకీలు జన్మ మధ్యలో వస్తుందనుకోలేదు...' అంది దుప్పటి మీదకి లాక్కుంటూ. గోపాలం 'లా' పుస్తకం ఒకటి చదువుతూ, చదువుతూ కుర్చీలోనే నిద్రపోయాడు. వకీలు ప్రాక్టీసు ఇటువంటి శుభశకునంతో ప్రారంభం అయింది.

గోపాలం గోడకు బోర్డు తగిలించాడు, శరీరానికి నల్లకోటు, గౌను తగిలించాడు గాని నెల తిరిగినా కేసొక్కటి గూడా రాలేదు. ఎరగనివాళ్ళు ఇంటికి ఎవరు వచ్చినా తనకు కేసులేవో పట్టుకొచ్చేవారనుకున్నాడు గాని ఇంటి అడ్రసులు తెలియక వెతుక్కుంటున్న బాటసారులు అని తెలుసుకోలేకపోయాడు. దెబ్బపైన తిట్లువేసి కట్టినట్లుగా ఒకళ్ళిద్దరు వచ్చి 'ఫలానా వెంకటరెడ్డిగారు ఎక్కడ ఉంటారు... పెద్ద వకీలుట గదా...' అని అడగటం గోపాలం భగ్గున మండిపడ్డంత ఆరాటపడ్డాడు. అడ్రసు తెలియని వాడికోసం ఊరంతా గాలిస్తున్నారు గాని ఎదురుగా తను కనిపిస్తుంటే ఆ కేసు ఏదో తనకే ఇయ్యవచ్చుగదా! అబ్బే!! పార్వతి చూస్తుందేమోనని వెనక్కి తిరిగి చూశాడు. మొగుడు కొట్టిందానికంటే తోడికోడలు నవ్వితే భరించటం కష్టం.

ఆ రోజు గోపాలం నల్లకోటు తగిలించుకుని భుజంమీద నల్లగౌను వేసుకుని రోడ్డుమీదకు బయలుదేరాడు. పార్వతి గుమ్మందాకా వచ్చింది.

'ఆ చార్‌మినార్ దగ్గర ఈ నల్ల గౌనులో తిరక్కండి...అక్కడ బూబు అంతా ఇల్లాంటి గౌన్లు వేసుకుని తిరుగుతుంటారుట...వాళ్ళల్లో కలిసిపోయారంటే...ఇంటిదారి మరిచిపోతారు...' అంది గేటువేస్తూ...

'అంత ఎగతాళిగా ఉందా...... నీకు...'

'అబ్బే ఎగతాళికాదండీ...! అంతా ఇల్లాంటి గౌన్లు వేసుకుంటారు గదా...! అందులో మీరెవరో మీకు ఎట్లా గుర్తుంటుంది...?'

గోపాలం వక క్షణం తికమకపడ్డాడు. వెనక్కు వచ్చి 'ఓ సంచీ ఉంటే పట్రా...ఈ గౌను...దాంట్లో పెట్టుకుని వెళతాను...' అన్నాడు.

'మీరు ఆ సంచీ పట్టుకెళితే... అక్కడ మండీలో కూరలు తెచ్చుకుంటున్నా ఏనుకుంటారండి...'

'ఏమిటి చెయ్యమంటావు...నా బ్రీఫ్ కేసు పట్టుకురా ... దాంట్లోనే పెట్టుకుంటాను...' గోపాలం వరండాలోకి వచ్చాడు.

'మీరేమీ అనుకోకపోతే వొకమాట చెపుతాను...'

'చెప్పు...'

'మీరు బ్రీఫ్‌కేసు తీసుకుని వెళతుంటే ... ప్రాక్టీసులేక ఇల్లు విడిచిపోతున్నా రనుకుంటారండి...'

గోపాలం కుర్చీలో కూలబడ్డాడు.

'ఏమిటి నీ ఉద్దేశం...పెద్ద శకునపక్షిలా తయారయ్యావు నా ప్రాణానికి...' గోపాలం కోటుకూడా తీసేసి వంకెకు తగిలించాడు.

'ఎ.జి. ఆఫీసులో ఉంటే నెలతిరగ్గానే జీతంరాళ్ళు దొరికేవి?...' పార్వతి కాళీజేబు చూపించింది.

'మనకూ వస్తాయి...మంచి కేసు రానీ...'


'నెల తిరిగింది గదా.. వక్క కేసు వచ్చిందా...?'

'ఇంకా నయం...! నెల తప్పిందన్నావుకాదు!!' గోపాలం కులాసా కోసం ప్రయత్నించాడు.

'అయ్యో సంబడం ... ఆ మంచి రోజులు ఎ.జి. ఆఫీసు ఉద్యోగంతోటే పోయినాయి...' పార్వతి నవ్వుతుంటే గోపాలం కోపం అంతా ఇట్టే చక్కాపోయింది.

గుమ్మానికి ఎవరూ కేసులు తీసుకుని రారు. మనమే పోయి ప్రయత్నించాలి. ఎట్లాంటివాళ్లూ కేసులు తీసుకుని వస్తారు! ఏ రకం కేసులు తను చేయగలడు. గోపాలం ఇంట్లో పదినిముషాలు అటూ ఇటూ పచారుచేసి తిరిగి కోర్టుకు వెళ్ళిపోయాడు. ఒక్కో కోర్టులో కొంచెం సేపు కూర్చున్నాడు, ఇంటిఅద్దె పెంచనివాళ్ళు, అద్దె అసలే ఇవ్వనివాళ్ళు, ఇల్లు కాళీచేయనివాళ్ళు వక పక్షం-మర్యాదగా ఊదరపెట్టి ఇల్లు కాళీచేయించేవాళ్ళు, సామాన్లు బయటపారేసి కుక్కల్ని ఉసిగొలిపేవాళ్ళు, కాళ్ళూ చేతులు విరగ్గొట్టేవాళ్ళు వకపక్షం-తనెవరి పక్షం ఉండడం ధర్మం...? మరొక కోర్టుకు వెళ్ళాడు.

నగలు ఎత్తుకుని పుట్టింటికి పారిపోయి వచ్చిన లక్ష్మీదేవి! అత్తగారికి గరిటకాలేసి పెట్టిన సుగుణ, ధర్మరాజును ఆఫీసుకు పంపి అర్జునుడికి కబురుచేసిన సుశీల వక పైడు,...కోడల్ని బావిలోకి తోసేవాళ్ళు, కిరసనాయిలు కొత్తకోడలు



మీదపోసి కుటుంబసమేతం చలిమంటలు కాచుకునేవాళ్ళు, ఉరెట్టి కిరసనాయిలు ఆదాచేసే బుద్ధిమంతులు మరొక వర్గం ...తను ఈ ధర్మకాటాలో ఎటు పక్క' చూస్తున్నాడు?

ఇరవై ఏళ్ళు తన ఫ్యాక్టరీలో చచ్చేట్టు చాకిరీ చేయించుకుని ఏదో చిన్న పేచీపెట్టి రోడ్డుమీద ముష్టివాడి లాగా వదిలేసే యజమానులు,ఒకపక్క-పూటకు తిండిలేక రోడ్ల వెంబడి అడుక్కుతింటున్నవాడిమీద జాలిపడి తన హోటల్లో పనిఇస్తే మానేజరు తల పగలగొట్టి డబ్బుఎత్తుకుని పారిపోయే వాళ్ళు ఇంకోపక్క.

ఇట్లా కోర్టులన్నీ తిరుగుతుంటే గోపాలం బుర్రగూడా తిరగడంమొదలు పెట్టింది. అన్నీ విపరీతధోరణులే. సమన్వయం. ధర్మమార్గం కనిపించడం లేదు. అధర్మమార్గమన్నా వాదించాలి లేకపోతే ధర్మాన్ని ఆశ్రయించి ఇంటి, పట్టున ఉండిపోవాలి. పార్వతితో ఈ మాటలన్నీ ఎట్లా చెప్పడం? ఎట్లా అర్థమవుతుంది? నదిలో దూకేటప్పుడే ఆలోచించాలి, అందులో మొసళ్ళు, పాములూ జలగలూ ఉంటాయని? అయినా ఈత నేర్చుకోకుండా నీళ్ళల్లోకి దూకడం తనదే తప్పు!! గోపాలం తలపట్టుకుని కూర్చుంటే సుగుణరావు తారసిల్లాడు. ఆ రోజు అతను కన్పించకపోతే... సన్యాసుల్లో కలిసిపోయేవాడేనేమో! అయినా సంసారులు సన్యాసుల్లో కలుస్తారుగాని వకీళ్ళు సన్యసిస్తారా?

కోర్టు కాంపౌండులో పెద్దచెట్టు, చెట్టు పైన నల్లగౌన్లు వేసుకుని గబ్బిలాలు తల్లక్రిందులుగా తపస్సు చేస్తున్నాయి. చెట్టుకింద ప్లీడర్లంతా హడావుడిగా తిరుగుతున్నారు, కొత్తకేసులు పట్టుకోవటానికి, వచ్చిన కేసువాడు పారిపోకుండా ఉండటానికి సకల ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ మధ్యలో సుగుణరావు తారసిల్లాడు.

స్కూటరు పిలియన్ సీటుమీద కూర్చుని సిగరెట్టుపొగ దిట్టంగా వదులుతున్నాడు.

'స్కూటరు ఎప్పుడు కొన్నావురా... నీ పని వాటంగా ఉన్నట్లుందే...!' అన్నాడు గోపాలం.

'ఈ స్కూటరు నాది కాదోయ్ పుల్లయ్యా...ఈ ప్రపంచంలో ప్రతి వస్తువునూ స్వంతదానిలాగా వాడుకోవాలి...ఖాళీగా ఉంది కూర్చున్నాం అంతే... అదిసరేగాని...నీ ప్రాక్టీసు ఎంతవరకు వచ్చింది? నాలుగు రాళ్ళు సంపాదించావా!'

'నా మొహంలా ఉంది ప్రాక్టీసు... మా ఇంట్లో మాటామాటా వచ్చి విడాకులు దాకా వచ్చేట్లుంది...'

'ఇంకేం...మీ ఆవిడ వకాల్తా నువ్వు తీసుకో...మీ మామగారిని అడిగి ఫీజు పుచ్చుకో... కేసు వచ్చిందంటే వదలకూడదు. ఈ వృత్తిలోవున్న రహస్యం అదే...'

'ఈ కేసు నాకు వద్దంటే...నువ్వు నా విడాకులకేసు చేపట్టేట్లున్నావు...'

'నిస్సంకోచంగా...'

గోపాలం ఉలిక్కిపడ్డాడు. తనింట్లో భార్య విడాకుల గురించి ఎవరో వకీలుతో మాట్లాడుతున్నట్లు తోచింది. ముందు వెంటనే విడాకులు తీసుకుని, కావాలంటే మళ్ళీ ఆయన్నే పెళ్ళిచేసుకోవచ్చని హిందూ 'లా' వప్పుకుంటుందిట. అదే ముస్లిం 'లా' అయితే విడాకులిచ్చిన తర్వాత, మరెవరినన్నా వివాహం చేసుకుని, వాడికి విడాకులిచ్చి, మొదటి మొగుడితో రెండోపెళ్ళి చేసుకోవచ్చు. హిందూ చట్టంప్రకారం అయితే ఇంత తికమక లేదు. గోపాలం సూటిగా 'లా' కాలేజికి వెళ్ళి తనకు హిందూ 'లా' చెప్పిన లెక్చరర్ని తన్నివద్దామనుకున్నాడు. క్రిమినల్ 'లా' బోధించిన లెక్చరరు జ్ఞాపకంవచ్చి వెనక్కు తగ్గాడు.

సుగుణరావు గోపాలం ముఖం వంకనే చూస్తూ 'ఏమిటిరా పగటి కలలు కంటున్నావు. పది కలలు కనేదానికంటే ఒక కల నిజంచేసుకోవడం ముఖ్యం!'

గోపాలం ఈ లోకంలోకి వస్తూనే 'ఈ పూట పది రూపాయలు సంపాదించందే...ఇంటికి పోయేదిలేదు. నీకు బోలెడన్ని కేసులున్నాయి గదరా.,.ఒక కేసు నేను చేస్తాను, నీకు తోచిన ఫీజు ఇయ్యి...' అన్నాడు.

'సరే పద...అయితే ఒక షరతు... నేను చెప్పినట్లు చెయ్యాలి... అది తప్పు... ఇది వప్పు... అంటూ సంధి మాటలు రానీకూడదు...'

'పద...' ముందుకు అడుగు లేస్తుంటనే. 'నమస్కారం సార్...' అంటూ ఓ పోలీసుజవాను నమస్కారం పెట్టాడు. సుగుణరావు పదిరూపాయలు తీసి చేతిలో పెట్టాడు.

'గుమాస్తాగారు కూడా ... మీకు నమస్కారం చెప్పమన్నారు సార్...'

సుగుణరావు ఇంకో పదిరూపాయలు తీసి జేబులోపెట్టాడు.

'కోర్టుకు రండి సార్... మేజిస్ట్రేటు గారు పిలుస్తున్నారు...'

'ఊ... పద...'

గోపాలం కోర్టుహాలులోకి వెళ్ళాడు. ఒకచేతికి బేడీవేసి రెండోబేడీని పోలీసు పట్టుకుని నిలబడ్డాడు. ఎవరు ఎవర్ని పట్టుకున్నారో తెలియటంలేదు. గోడ కానుకుని మరో ఇద్దరు నిలబడ్డారు. అప్పుడే మరో ఇద్దరు లోపలకు వచ్చి వంగివంగి సలాములు కొట్టుకుంటూ నడిచారు.

'నేను చేయవలసిన కేసు ఏమిటి...'

'ఆ నలుగురు నా క్లయింట్లే... నీకు నచ్చిన కేసు నువ్వు చెయ్యి...

ఏం చెయ్యాలో...వాళ్లని ఏం ప్రశ్నలు అడగాలో ... వాళ్లకు సాక్ష్యం ఏం చెప్పించాలో చూపిస్తాను...'

'ఎవరు వాళ్లు...'

'మొదటివాడు ... నాన్ రొట్టె ఎత్తుకుని పారిపోయాడు ... రెండవ వాడు ట్రాన్సిస్టరు దొంగిలించాడు... మూడోవాడు స్కూటరు... నాలుగో పెద్దమనిషి బ్యాంకు లూటీ... ఇదీ క్రమం...'

'అయిదోవాడేడీ... తలుపులు, తలలు పగలగొట్టి ఇల్లంతా గుల్ల చేసిన వాడు...'

'వాడి కేసు రేపుంది...

'నేనేం చెయ్యాలి...'

'వీళ్లందరినీ జైలు బారినుండి కాపాడాలి...'

'ఎందుకు...?'

'వీళ్లందరూ జైలుకు పోతే మనకు ఫీజు ఎవరిస్తారు?'

గోపాలం సుగుణరావు వంక తీవ్రంగా చూశాడు.

'హాస్యం ఆడటానికి ఇదా సమయం?'

'నీ మొహంలా ఉంది... వాళ్లు నిజంగా దొంగతనం చేశారో లేదో మనకు తెలియదు... పోలీసులు 'దొంగ' అంటున్నారు. వాళ్లు కాదు అంటున్నారు. సత్యం భగవంతుడికి తెలియాలి... మనకు 'లా' తెలిస్తే చాలు...' సుగుణరావు మెల్లిగా నవ్వు తున్నాడు. గోపాలం నల్లకోటు అక్కడే వదిలేసి గోడదూకి ఎక్కడికన్నా పారి పోదామనుకుంటున్నాడు...

'వక్కపొడి బయటకు రా ... నాకీ కేసులు వద్దు...'

'ప్రాక్టీసు చెయ్యటం ఇష్టంలేని వాడివి... ఇంటి దగ్గర కూర్చోపోయి నావా...గోళ్లు గిల్లుకుంటూ...' సుగుణా రావు వెనకాలే వచ్చాడు-

'వేరే కేసులేం లేవా...'




'వీటిలో బాధపడాల్సింది ఏముంది... దోషిని శిక్షించకపోయినా, నిర్దోషిని శిక్షించినా ఆ పాపం జడ్జీ గారిది... మనం నిమిత్తమాత్రులం ... గీతా సారం ఏమిటి?' సుగుణరావు సిగరెట్టు పెట్టెకోసం జేబులు తడుముకున్నాడు.

'లా తయారుచేయటం మొదటి దశ- యం.ఎల్.ఏ. పని... లా చెప్పటం లెక్చరరు... రెండవదశ... దొంగ తనం చేసినవాడివి కాపాడి వాడు ఎత్తుకువచ్చినదాంట్లో కొంత పంచు కోవడం మూడో అవతారం... నేను చేప్పేది బుర్రకు ఎక్కుతుందా...'

'దొంగిలించిన సొమ్ము పంచుకునే దానికంటే దొంగతనానికి సూటిగా బయలుదేరవచ్చు గదా మొత్తం సొమ్ము మనకే ముడుతుంది...?' గోపాలం ఎదురుతిరిగాడు.

'అదీ వరస.... నీ బుర్ర బాగానే పనిచేస్తోంది. అంత ధైర్యం లేకగాని అదే నాలుగోమెట్టు... డార్విను చెప్పిన పరిణామ సిద్ధాంతం అదే...' సుగుణరావు జారిపోతున్న నల్లగౌను పైకి లాక్కుంటున్నాడు. చెట్టుపైనుంచి కొంగ వొకటి అసహ్యంగా రెట్ట వేసింది.

'ఇహ నువ్వింటికి వెళ్లు... రాత్రికి వచ్చి కలుస్తాను...' అన్నాడు సుగుణ రావు కోర్టు హాలులోకి పోతూ... గోపాలం ఒంటరిగా నట్టేట్లో నిలబడి నట్లు ఫీలయ్యాడు. తను ఎట్లా డబ్బు సంపాదించడం? ఉద్యోగం ఊడి పోయింది! మళ్ళీ వెనక్కు రాని స్తే చెంపలు వేసుకుని గుంజీలు తీసి ఉద్యోగంలోకి వెళ్ళిపోతాడు. చెవులు మెలిపెట్టుకోమంటే గూడా రెడీ... అసలే చెమటపోస్తోంది! పైన కోటు, ఆపైన గౌను!

అసలే కోతి, కల్లు తాగిందట... నిప్పు తొక్కిందట. అట్లా ఉంది తన పరిస్థితి. రుమాలుతో ముఖం తుడుచు కుంటుంటే ఓ చక్కటి చుక్క కిళ్లీ నములుకుంటూ వచ్చింది.

'నమస్తే సార్...' అంది గోపాలం తనని కాదనుకున్నాడు.

'నన్ను గుర్తు పట్టలేదా సార్...రాజ మండ్రీలో...' తమలపాకులు, పొగాకు నమిలి నమిలి ఉమ్మేస్తోంది... తామిద్దరూ మాట్లాడుకోవటం ఎవరన్నా చూస్తున్నారేమోనని గోపాలం నాలుగు పక్కలా చూశాడు. ఆమెను తనెక్కడో చూశాడు. అవును... రాజమండ్రీలో సినిమాహాలు దగ్గర పూల దుకాణం.

'ఇక్కడేంచేస్తున్నావు...?'

'జానెడు పొట్టకోసం...కష్టంచేయాలి గదసార్... తమరు వకీలు పని చేస్తున్నట్టు తెలియదు సార్... ఇక నుంచీ మీ దగ్గరకే వస్తాం...' ఆమె నవ్వుతుంటే పళ్ళ వరస కాల్చిన మొక్కజొన్న గింజల్లా తెలుపుమీద నలుపు పులుముకున్నాయి. జాకెట్టులోనికి చెయ్యి పోనిచ్చి వంద రూపాయల కాగితం బయటకు తీసి గోపాలానికి అందించింది. ఆ కాగితం ముట్టుకుంటే వొక్కసారి వొళ్ళంతా గగుర్పొడిచింది. కాని బోడి రాజమండ్రీలోనే ఆమెను పలకరించి ఎరగడు! ఛ...ఛ...ఇంటికి వెళ్ళి సబ్బుపెట్టి చెయ్యి కడుక్కోవాలి.

'ఎందుకు ఈ డబ్బు...'

'మీకు ఫీజు సార్...

'మా బస్తీపిల్ల మొగుడు కొట్టాడని పోలీస్ రిపోర్టు ఇచ్చింది సార్...వాడికి బుద్ధితక్కువై చెప్పింది సార్... మా పిల్లను పోలీసు పట్టుకుపోయాడు... వాడినుండి విడిపించాలి సార్... మీకు మల్లా పైసలు తెచ్చిస్తా...చచ్చి నీ కడుపున పుడతా దొరా...' దగ్గరకు వచ్చి ఆమె చేతులు పట్టుకునేట్టుగా ఉంది. గోపాలానికి భయం వేసింది. సుగుణరావు అంతా చూస్తూనే ఉన్నాడు. మెల్లిగా దగ్గరకు వచ్చాడు.

'ఏమిటయ్యింది...'

'మా చెల్లెల్ని... పోలీసులు నూక్కుపోయారు దొరా...'

'నీకంతా చెల్లెళ్ళే గాని... ఏ స్టేషనులో ఉంది...'

'బేగంబజారులో... దొరా...'

'మావాడికి ఎంతిచ్చావు...'

'ఓ పచ్చకాగితం దొరా...'

'ఇంకో కాగితం గూడా తియ్యి...'

'లేదు... దొరా...'

'నువ్వు తీసి ఇస్తావా... నన్ను తీసుకోమంటావా...'

సుగుణరావు ధోరణి చూస్తే మరో వంద బలవంతాన తీసేసుకునేట్టున్నాడు. ఆమె మళ్లా నవ్వుతోంది, జాకెట్టులో నుంచి మరో పచ్చకాగితం తీసి గోపాలం చేతిలో పెట్టింది. నోటులు పట్టుకుంటే ఈసారి చెయ్యి గగుర్పాటు పొందలేదు. ఇంకెన్ని కాగితాలున్నాయో స్వయంగా పరీక్షించాలనిపించింది.

'తొందరగా... రండి... దొరా...' ఆమె బెదురు బెదురుగా అడుగులు వేసింది

'ఈ ఫీజు నువ్వే తీసుకో... ఏం చెయ్యాలో చెపుతాను పద...' సుగుణరావు ఆమె వెనకాలే తగులుతున్నంత దూరంలో నడుస్తున్నాడు. ముగ్గురూ పోలీసు స్టేషనుకు ఆటోలో వెళ్లారు.

అక్కడ ఏమేం చెయ్యాలో సుగుణరావు చూపించాడు. తాను లా కాలేజీలో చదివిన మూడు సంవత్సరాల్లో, చదివిన ముప్పై పుస్తకాల్లో ఈ ప్రస్తావనే లేదు. కేసు పని పూర్తయ్యేటప్పటికి పొద్దున కూకింది.

ఇంటి గుమ్మందగ్గర పార్వతి గేటు దగ్గర నిలబడింది. తనను చూడగానే పూర్వకాలంలో లోపలి నుంచి వచ్చి గేటు తీసి చేతిలో సంచి అందుకునేది! ఈరోజు మెదలకుండా లోపలకు వెళ్లిపోయింది.

'ఈరోజు నేను వొక కేసు పట్టాను...' అన్నాడు గోపాలం.

'అదేమన్నా ఉడతా పట్టటానికి...?'

'గోపాలం వంక పరిశీలనగా చూసింది. 'ఏం కేసు...? ఎంతిచ్చారు...?' పార్వతి కోటుజేబులో చెయ్యి వెయ్యబోయింది. గోపాలం వెనక్కు తగ్గాడు.

'రాత్రికి చెబుతాను...' అన్నాడు.

భోజనాలు అయి నిద్రపోయేముందు పార్వతి మళ్లీ అడిగింది. 'ఏం కేసు... ఎంత ఫీజు సంపాదించారు...' అని. గోపాలం దిండుకింద నుంచి రెండు వంద రూపాయిల కాగితాలు తీసి అందించాడు. మసక చీకటిలో పక్కకు తిరిగిచూశాడు. పార్వతి రాజమండ్రి పిల్లలా కనిపించింది. తను తాను కాదు. ఎవరో! రాజమండ్రి పిల్లకు ఎవరు, ఏ సన్నివేశంలో ఆ నోటు అందించారో! గోపాలానికి కంపరంగా ఉన్నది–ఆ నోటు ఎన్ని చేతులు మారినాయో!! ఉద్యోగి, జేబుదొంగ, తాగుబోతు, తిరుగుబోతు, రాజమండ్రి పిల్ల... తాను... ఈ రంగుల రాట్నంలో తానిప్పుడు గుర్రం ఎక్కాడు?!

పార్వతి మళ్ళీ అడిగింది కేసు గురించి.

'కేసు ఏదయితేనేం... రెండు వందల రూపాయలు రెండు గంటల్లో సంపాదించాను...' అన్నాడు పక్కకు తిరుగుతూ.

'పదేళ్ల నుంచి మీతో సంసారం చేస్తుంటే... పండగకు చీరకొనటం చేతకాలేదు... మొన్న దసరాశలవులకు పోయి మూడు రోజులుంటే... మా బావ పట్టుచీర కొనిపెట్టాడు' అంది ఒకత్తె... అట్లా ఉంది మీరు చెప్పేది...' అంది పార్వతి. రెండు వంద రూపాయల కాగితాలు తీసి జాకెట్టులో పెట్టుకుంది. గోపాలం ఉలిక్కిపడి లేచాడు. డబ్బు తీసుకుందామనుకున్నాడు. ధైర్యం చాలలేదు! పార్వతి రాజమండ్రి పిల్లలాగా నవ్వుతోందేమిటి? నల్లకోటు వారిద్దరి మధ్య ఎర్రకోటలా ఉంది. ★